"చెల్లాయ్! ఓపని చెయ్యి! సినిమాల్లో చేర తున్నావా? చదువు చెప్పిస్తావా? అని బెదిరిస్తే చదువుకే పంపిస్తాను జగన్నాథ్. అంతే కాని, ప్రతీ ఇంట్లోనూ భయమనే భూతానికి జడిసి, మన ఆప్తుల ప్రేమని బలివేస్తాం. లోకం తీరే అంత. వదంతులు, గుసగుసలు, ఆరోపణలు, వైవ స్వరూపాలు కావే! ఈ దయ్యాలకి, ఏ చెల్లెలి ప్రేమో, కూతురి ప్రేమో బలివేస్తాం. నువ్వు ఇంటి మర్యాదకు, అన్నయ్యమీద ప్రేమవలన జడిశావంటే ఓటమి తప్పదు. చదువుకోవాలంటే నాతో చెప్పలేకపోయావా! అన్నాళ్లూ వంచేవాడ్ని కదా! కాని నేను మొగాణ్ణే అన్న మాటకు కోపం తెచ్చుకుని, మళ్ళా చదువు మానకేం అప్పుడు!

"సరే చెల్లాయిలూ! మళ్ళా వస్తాను వారం లోగానే" అంటూ వచ్చేశాను.

పాపం! ఇంత ఇళ్ళల్లో కస్తీ పట్టివచ్చే అమ్మాయిలమీద కాలేజీల్లో కావల్సినన్ని వదంతులు వేస్తాం. సగంపైగా నిజముండవు కదా అనుకుంటూ బస చేరుకున్నాను

---

# ★ చేచేతులారా.... ★

వై. ఎ. శర్మ

"అమ్మను నానాన్నారు, ఏమీ అనలేదు మామయ్యా! అలా చెయ్యకూడదమ్మా అని చెల్లాయినే మందలించారు గాని. పాపం చెల్లాయి చెంపమీద అమ్మ ఐదువేళ్లూ అతుక్కుపోయినై! చెల్లాయి తప్పేం లేదు మామయ్యా, అంతా ఆ కొంటెకోణంగి సీతాం చేసిన చిలిపితనం తప్పు!" కన్నీళ్ళు గిర్రున తిరిగినై బాపూజీ కళ్ళల్లో.

"సంగతేమిటి చెప్పు బాపూ." అనునయంగా అడిగాను.

"మరేమో, చెల్లాయేమో, నిన్న పొద్దున పక్కవాళ్ళింటి కెళ్లింది మామయ్యా, వాళ్ల సీత, తాయారూ, రామలక్ష్మి బొమ్మలపెళ్లి చేశాం రమ్మని పిలిస్తేనూ. మళ్లీ ఊరికే వెళ్లలేదు చెల్లాయైనా వాళ్ళను దేబిరించుకుంటూ; కంది పప్పూ, బెల్లం, అటుకులూ, అప్పడమ్ముక్కలూ, వక్కపొడీ ఇన్ని తీసుకు మరీ వెళ్లింది, ఎలానూ ఆడపెళ్లివాళ్లం గదా అని. ఆ సీత మరీ కుళ్లుమోతుపిల్ల, ఆడుకున్నంతసేపూ ఆడుకుని, అన్ని పప్పులూ తినేసి 'పాపం పప్పులు తీసుకుని మా యింటికి పరిగెత్తుకొచ్చావు, వండుకునే గిన్నెకు గతిలేక!' అని దెప్పిపొడిచిందిట మామయ్యా! ఆమాటలు వింటుంటే చెల్లాయితో పాటు నాకూ ఏడుపొచ్చింది! మనమేం లేనివాళ్ళమా చెప్పు! ఒకళ్ళను పోయి ముష్టెత్తుకోవటానికి!! రమ్మని పిలిచిందీ తానే, మళ్ళీ తిట్టి వెళ్ళగొట్టిందీ తానే! 'అన్నాయ్, నాకో లక్కపిట్టి తెచ్చిపెట్టవుట్రా?' అని జాలిగా బతిమాలుతుంది మామయ్యా, నువ్వంటే నీకూ గుండె కరిగిపోయేదే!'

సాకూ స్నిగ్ధహృదయం ఉందని గుర్తించి సంతసకు ఆ పసివాణ్ణి మనస్సులోనే అభినందించుకున్నాను.

"మిఠాయి కొనుక్కోమని వెనక నువ్విచ్చిపోయిన డబ్బుంటే అదితీసుకుని అప్పటికప్పుడు బజారుకు పరుగెత్తి సరిగ్గా అదేసైజు, అదేరంగు లక్కపిట్టి తెచ్చి చెల్లాయికిచ్చి ఆడుకోమన్నాను. 'ఇహను సీతగారింటి గడప తొక్కితే ఒట్టే' అని ఒట్టేసుకున్నామిద్దరమూ. నేను బజారుకెళ్ళటం చూసింది గావును, ఏం తెచ్చాననుకుందో ఏమో మనింటికి పరిగెత్తుకొచ్చింది మామయ్యా. ఈ సీతకు బొత్తిగా సిగ్గేలేదేం? వచ్చింది ఊరుకో వచ్చా? చెల్లాయి తీరా అన్నం వొండుకుంటున్న లక్కపిట్టి తనదేనని రాగాలు పెట్టటమే కాకుండా యింటికి పరిగెత్తి వాళ్లమ్మనుగూడా వెంటబెట్టుకొచ్చింది పోట్లాటకు. మరామె ఏం మాట్లాడిందో ఏమో, చెల్లాయి సీతాం లక్కపిట్టి దొంగిలించుకొచ్చినట్టు తేల్చుకున్నా రిద్దరూ! 'కాదే అమ్మా' అని నేను చెబుతూనే

ఉన్నాను మామయ్యా. నా మాట వింటేనా? 'మా యింట్లో చెడబుట్టావే దొంగముండా' అంటూ చెంప వాచేట్టు బాదింది మామయ్యా అమ్మ చెల్లాయినీ! పాపమా దెబ్బకు చెల్లాయి గజగజా వొణికి పోయింది." సరదాగా మాట నిలచిపోయి మళ్లీ రెండు మూడు నిమిషాల్దాకా కోలుకోలేదు బాపూజీ

అక్కయ్య చేసిన తెలివి తక్కువపని బాపూజీ లేతగుండెమీద ఎంతగాఢంగా హత్తుకున్నదీ ఆరోజుల్లో అర్థంచేసుకోలేక పోయాను! జాని సంగతి చెప్పేందుకే వీల్లేదు. ఉండుండి ఉలిక్కి పడేది. రాత్రిళ్లు నిద్రపోతున్నదల్లా లేచి కూచునేది. 'నేను దొంగను కాదే అమ్మా' అంటూ. బాపూజీ చెపుతుంటే 'ఏమో' అనుకున్నాను గాని, ఆ బాధను స్వయంగా చూసిన తరువాత నేనే యెంతో యిదైనాను. అక్కయ్యగూడా పస్తాయించక పోలేదు! "నేనే పొరబడ్డానేమోరా, ఆ రాక్షసి పోరు పడ్లేక పసి సన్యాసిని పశువును బాదినట్టు బాదేశాను, నా చెయ్యి పడిపోను!" చాలా నొచ్చుకుంది జానిలేకుండా చూసి ఇహ బాధ కక్వమే వేరు. నిండుకుండ! తొణకదు, బెణకదు! మెట్టుకు ఊరుకోలేకుంట: ఇంకా "ఇంకా రెండు తగిలితే అదే దోవ కొస్తుందని" అక్కయ్యతో అని, మొహం పక్కకు తిప్పుకుని కళ్లొత్తుకోటం! అక్కయ్య ఇప్పటికీ ఏడుస్తుంది గుండె తరుక్కుపోయేట్టు.

ఏదన్నా ఉద్ధృతమైన శబ్దం విన్నా ఎవరన్నా కోపంగా మాట్లాడుతున్నా మూర్ఛ వొచ్చి పడిపోయేది జాని. దాదాపు గంటా గంటన్నరవరకూ అలానే వుండేది. బావా, బాపూజీ దగ్గరుండి ఉపచారం చేస్తేనూ అప్పటికన్నా తెలివొచ్చేది! కర్మం చాలక ఆ యిద్దరూ లేకుండా అక్కయ్యా జానీ ఒంటరిగా యింట్లో వున్నారంటే చాలు - వెర్రి కేక పెట్టి విరుచుకు పడిపోయేది! అదేం ఖర్మమో అక్కయ్యనో రాక్షసిని చూసినట్టు చూసేది జాని!

చాలాచోట్ల చూపించారు. ఎన్నెన్నో మందులు వాడారు. గాలో ధూళో అనుకుని మంత్రాలు వెట్టించారు. ఆంజనేయుడికి ప్రదక్షిణాలు చేయించారు. తిరపతి వెంకటేశ్వర స్వామికి పిండికొండపోసి అఖండం వెలిగించారు. ఏమీ ప్రయోజనం లేకపోయింది.

ఒకరోజున బాపూజీ నా దగ్గిరికి పరిగెత్తు కొచ్చి, "మామయ్యా, ఓ రూపాయి లక్క పిడతలుకొని పెట్టుకురా మామయ్యా" అన్నాడు. కొంప లంటుకుపోతున్నంత ఆదుర్దాతో!

"లక్కపిడత లెందుకు నాన్నా నీకు మగ వాడికి? ఎంచక్కా బంతీ బాటూ తెచ్చిస్తాను, అడుక్కోక?"

"యురేకా" నీళ్లల్లో తను తేలినప్పుడన్నా ఆర్కిమెడీస్ అంత ఆనందం పొందివుండడేమో.

'ఏం మామయ్యా, తెచ్చిపెట్టవూ!' బతిమాలటమల్లా అల్లరికింద మారుతుందేమోనని అలాగేనన్నాను తప్పించుకోటానికి.

ఆరోజు మొదలు నన్ను చూస్తే చాలు, "లక్క పిడతలు తెచ్చావా మామయ్యా అని సతాయించేవాడు. నేనంటే వాడికన్న చనువుకూ ఆ మోజు విశ్వాసానికీ ఆనందించాను గాని నాకు తెగ మరుపు. అయినా ఏవేవో లక్ష కావాలని మారాం చేసి కానేపట్లో మరిచిపోతారు పసివాళ్లు దాన్ని మనమింత సీరియస్‌గా పట్టించుకోవాలా? ఆ సమయానికి సరేనంటే సరిపోయే ననుకున్నాన్నేను. పైగా ఈ వెధవ లక్క చిట్లు దేనికి, ఆడంగి అయిపోతాడని నా భయం.

"ఇదుగో తెస్తాను, అదుగో తెస్తాను. తెద్దామనుకుంటూనే తీరా వచ్చేనాటికి మరిచి పోయాను" అని చెప్పి తప్పించుకునేవాణ్ణి. "ఈమాటు తప్పకుండా తెస్తానుగా" అనే ప్రమాణ స్వీకారంతో.

"పో మామయ్యా, నువ్వెప్పుడూ యింతే! ఒక్క రూపాయింకోసం నేనే తెచ్చుకొంటను. ఈ పెద్దవాళ్లు డబ్బులన్నా యివ్వరు పీడ!" ఎనిమిదౌన్సుల రేషను అతులు పరచాలిసివచ్చిన ఆహారశాఖా మంత్రికన్నా ఎక్కువగా నిరుత్సాహ పడ్డాడు బాపూజీ!

రోజు రోజుకూ జాని జబ్బు పెరుగుతున్నదే గాని తగ్గటంలేదు! ఓరాత్రి పదకొండు గంటలప్పుడు ఎవరబ్బా తలుపు తట్టేది - అర్థరాత్రివేళ అని యిట్లాజూస్తే-రాజమండ్రీనించి వైరు! చించి చూస్తూంటేనే కాళ్లు తేలిపోయినై.

అప్పటికప్పుడు పెట్టే బేడా సర్దుకుని "వెంటనే వస్తాను. ఇల్లు జాగ్రత్త" అని యింట్లో చెప్పి రాత్రి పాసెంజరుకోసం పరుగెత్తి ఎలాగో అందుకున్నాను. గుర్రబ్బండివాణ్ణి బతిమాలి అయిదు రూపాయలు చదివించుకొని ట్రెయిను రెండుగంటలు లేటు చేసినందుకు రైలువాళ్లను అభినందించుకుంటూ!

* * *

ఇంట్లో అడుగు పెట్టేసరికి ఇంటిల్లిపాదీ గొల్లు మన్నారు! అక్కయ్య కడుపు చెరువే ఐంది! ఎన్నడూ కంట తడిపెట్టి యెరగని బావ కూడా నన్ను జూడగానే ఓమాటు కళ్లు తుడుచుకుని 'చేసుకున్న వాళ్లకు చేసుకున్నంత మహాదేవా!' అని వూరుకున్నాడు!

బాపూజీ ఏడీ అని వెతికాను. పాపం పసి వెధవ కాలుగాలిన పిల్లిలా గోడలు పట్టుకు తిరుగుతున్నాడు గూళ్లు వెదుక్కుంటూను! నన్ను చూసే మాట్టంతోనే ప్రాణం లేచొచ్చినట్టయి పరిగెత్తుకొచ్చి నా మెడ కావిలేసుకున్నాడు!

"సమయానికొచ్చావు మామయ్యా సరిగానూ! నిన్నట్నించీ నీకోసం ఎదురు చూస్తున్నాను! లక్కపిడతలేవీ? వెంటనే యివ్వవనుంది!" అస్తమానం లక్కపిడతలు నా వెంట కట్టుకు తిరుగుతుండాలని వీడి వుద్దేశ్యం! నాకు మా చెడ్డ చిరాకేసింది చెప్పొద్దూ!

"ఓ వెంప జానికి కిందెట్టూ మీదెట్టూ ఔతుంటే నీకు లక్కపిడతలు కావాలిసొచ్చినయ్యేం వెధవా! వేళాపాళా తెలియక్కర్లా?" విదిలించి పారేశాను కోపంకొద్దీ. ఈ కుర్రకుంకలకు తమ కోడికి మూడుకాళ్లే గాని అర్ధరాత్రి వేళ లక్కపిడతలెలా వొస్తయ్యా అన్న ఆలోచనే వుండదు!

ఎప్పుడూ చనువుగా దగ్గిరికి లేసి బుజ్జగించే వాణ్ణి కసురుకోటంతో భయపడి పరిగెత్తాడు ఏడుస్తూ నావంక చూస్తూ. నాకు బాగా మాలిమైనాడు వెధవ! మళ్లీ రెండుమూడు సార్లా చాయలకు వచ్చినా ఎవర్నీ పలకరించకుండా "లక్కపిడతలెలా వస్తై? లక్కపిడతలు!" అని తనలో తాను గొణుక్కున్నాడు. పాపం జాలేసింది వాడి పట్టుదలకు. కాని ఆ గందరగోళంలో ఎవళ్లూ వాడి గొడవ పట్టించుకోలేదు.

మానవ ప్రయత్నానికి మించింది విధి. మొగ్గా కుండాపోయింది జానీ! ఆరోజు బాపూజీ పడ్డ ఆవేదన యింతంతగాదు! వద్దురా బాబూ ధడుసుకుంటావని అరుస్తూనే వున్నాను, వినకుండా శ్మశానానికి చక్కావచ్చాడూ జాని శవంవెంట! ఈ బావ మరీనూ. వెళ్లొద్దని కసరకూడదూ! ఏమీ పట్టించుకోడు! అక్కడికీ చెప్పిచూశాను కూడా!

'నువ్వు కసిరావుగా?' కొడుక్కు దగ్గర తండ్రి!

అనుకున్నంతపనీ ఐంది! ఆరోజునించీ బాపూజీ గొణుక్కుంటాడు, ఏమిటో సణుక్కుంటాడు. అంతలో నవ్వుతాడు. "ఇక ఫరవా లేదు లక్కపిడతలు వచ్చేసినై" అంటాడు! అప్పుడప్పుడు జానిని పాతిపెట్టిన చోటికి వెళ్లొస్తుండేవాట్ట ఒంటరిగా! అక్కయ్య దిగులుకు అంతులేదు! ప్రశ్నడిగితే జాని దయ్యమై పట్టుకుందని చెప్పారు బాపూజీని. ఏటేటా జాని యీడు ఆడపిల్లల్ని పిలిచి తలలంటి నీళ్లుపోసి పరికిణీలూ గౌన్లూ కట్టబెట్టేది అక్కయ్య. "ఎందుకే అమ్మా వీళ్లగుడ్డలిస్తున్నావు?" అనడిగేవాట్ట బాపూజీ. "జానికోసం" అనేదిట అక్కయ్య. "లక్కపిడతలు లేవుగా?" అని కన్నీళ్లు పెట్టుకునేవాట్ట! నేను కనబడితే చాలు "లక్కపిడతలు ఎప్పుడు తెస్తావు మామయ్యా!" అని నిలేసేవాడు. పరిస్థితులు శృతిమించి రాగాన పడేట్టున్నవని తెలిశాక "ఈమాటు సంకురాత్రికి తప్పక తెస్తాన"ని వాగ్దానం చేశాను.



తెల్లవారితే పండగ. పండక్కి రమ్మని బావను ఎన్నిసార్లు పిలిచినా తీరిక లేదంటాడు. సరే ఏం జేస్తాం? ఆయన బెట్టు చేస్తే మనకు తప్పుతుందీ పిల్ల నిచ్చుకున్నాక? ఒక్క యేడన్నా పండక్కి మావాళ్లింటికి గారేనుండి అని యింట్లో గునుస్తున్నా వినిపించుకోకుండా బావకు పట్టు జామారూ, అక్కయ్యకు పట్టు చీరా రవికా, బాపూజీకి పట్టుసూటూ కుట్టించుకుని బయల్దేరాను. ఆ దర్జీవాడో మహాదూ! వారం రోజులు ముందిస్తానన్నవాడు ఎంతో బతిమాలించుకుని, డబల్ రేటు చార్జి చేసి, పండగనాటిగ్గాని యివ్వాడు కాదు! సమయానికి జ్ఞాపకమొచ్చింది నా మట్టిబుర్రకు బాపూజీ లక్కపిడతలకోసం ఎంత తహతహ లాడిపోతుండేవాడో! వెంటనే బజారుకు పరిగెత్తి విచారిస్తే పండగ్గాదూ? మండిపోతున్నయి ధరలు! ఓ రెండు రూపాయల లక్కపిట్టుగొని ఓ సంచిలో వేసి మూటకట్టి పెండు బాగులో పెడదామని చూస్తే- అది గుడ్డలకే సరిపోయింది. ఇంకా తొక్కితే గుడ్డలు నలిగిపోతై. అంచేత సంచీ విడిగానే వుంచాను. ఆదరా బాదరా రైలుస్టేషనుకు పరిగెత్తే సరికి మెయిలు కాస్తా వెళ్ళిపోయింది. పండగపూటా రాముడితమ్ముణ్ణి తలుచుకుంటూ గూడానికి బస్సెక్కాను. "పండ గొచ్చేసింది, బాపూజీ నాకోసం ఎదురు చూస్తుంటాడే రానంటూటాడో ఏమో" అని యెంతో పరితపించాను. గ్రహచారం! సగం దారిలో ఇంజెను చెడిపోయి రెండుగంటలు నిలిచిపోయింది బస్సు!

గూడెంలో బస్సు మారి కొవ్వూర్లో దిగి లాంచిమీద గోదావరి దాటి చచ్చిచెడి రాజమండ్రి చేరేసరికి సాయంత్రం మూడైంది! తీరా యింటికెళ్ళితే బావ ఇంట్లోలేడు. "ఇప్పుడొస్తున్నావేంరా?" అంది అక్కయ్య. "ఏం జెప్పను? ఏదో ఆలస్యమైందిలే, అంతా బాగున్నారా?" అనడిగాను మామూలుగా.

"అయ్యో నీకు తెలియనే లేదా? ఉత్తరం రాయమన్నానే మీ బావను? పదిరోజుల్నుంచి బాపూజీ లేవటంలేదు. అమ్మాయి లేనేలేదు, ఈ నలుగురు చూసుకుని బతుకుతున్నాం ఇన్నాళ్లూ. ఎన్నడూ జిర్రున చీది ఎరగడు! నిద్రాహారాలు మానుకుని డాక్టరువెంట కాళ్ళకు బలపం గట్టుకు తిరుగుతున్నారు మీ బావ! పాపం వారికి మనస్సు మనస్సులో వుంటం లేదు! అసలు జబ్బేమిటో అంతు బట్టందే ఎవరికీనీ? ఇంతకూ మా దురదృష్టంగావును. తగిలిన వేలుకే తగులుతుంది." పసిపిల్లలా బావురుమంది అక్కయ్య

"ఏం మాటలక్కయ్యా అవి? తప్పు ఊరుకో! ఎందుకలా అధైర్యపడతావు? అబ్బాయి నాకోసం బెంగ పెట్టుకునివుంటాడంతే. నేనొచ్చానుగా? మరేంభయం. ఆ దేవున్నాడు రక్షకుడు!"

మానవుడి అసమర్థతను సమర్థించుకోడానికి ఆస్తికతను మించిన ఆలంబనం మరి లేదు.

"అహర్నిశలూ నిన్నే కలవరిస్తున్నాడు రా బాపు, ఈ మాయజ్వరం వచ్చిన దగ్గర్నుంచీ నీ!" కొంగుతో కళ్ళద్దుకుంది అక్కయ్య.

"బాపూ, బాపూ!" గొంతు పెగుల్చుకు బయట పడ్డయి రెండు మాటలు ఎలానో కష్టంమీద.

"మామయ్యా?" మాట తేలిపోతున్నది బాపూజీకి.

"ఔన్రా!" ఆపుకున్నా ఉబికివచ్చే కన్నీళ్లు అలికివేసినై నా చూపుల్ని.

"లక్క పిడతలు తెచ్చావా మామయ్యా?" గంగను అవతరింప జేసిన భగీరథుడి సంతోషంతో సంచీకోసం తడుముకున్నాను. ఏదీ! ఏమో! ఎక్కడ మరిచిపోయానో ఈ ఖంగారులో!

"ఏమిట్రా వెతుక్కుంటున్నావు? డబ్బాగిట్రా ఏం పోలేదు గద!" అక్కయ్య పరామర్శించింది!

"ఏంలేదు, ఏంలేదు!"

"ఏం మామయ్యా, తెచ్చా?" గుండెలు దించే ఆ అమాయకపు ప్రశ్నకు జవాబు దొరక్క తలగోక్కున్నాను.

"ఈ పెద్దవాళ్లంతా యింతే నమ్మా చెల్లాయ్, నే తెచ్చి పెడతానుగా లక్కపిట్లు, ఏడవకేం?" ఆత్మ విశ్వాసంతో కళ్లు మూశాడు మా బాపూజీ!

---

"గాంధీజీ మార్కు కారం. కూరల్లోకి కాదు, కళ్ళల్లో కొట్టడానికి మాత్రమే! ఎక్కడనైనను దొరకును." —(ఇటీవలి ఒక పత్రికలో వ్యాపార ప్రకటన)